

మద్యం అమ్మకాలు ధమాల్

- గత ఏడాదికంటే తగ్గిన ఆదాయం
- లెక్కలు వేస్తున్న అధికారులు
- గత నవంబరులో రూ.48 కోట్లు.. ఈ నెలలో రూ.32 కోట్లే

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

ఈ ఏడాది మద్యం అమ్మకాలు తగ్గాయి. ఆదాయం పడిపోయింది. గత ఏడాది నవంబరులో వచ్చిన ఆదాయంతో అధికారులు బేరీజు వేసుకుంటున్నారు. తగ్గడానికి కారణాలపై ఆరా తీస్తున్నారు. వాస్తవానికి నవంబరు నెలలో పండుగలుంటాయి. భక్తులు వివిధ రకాల మాలధారణలు చేస్తుంటారు. ఫలితంగా మద్యం అమ్మకాలు తగ్గిపోతాయి. ఇది అన్‌సీజన్‌గా భావిస్తారు. కానీ గత ఏడాది ఇదే తరహాలో పండుగలొచ్చినా అప్పట్లో ఎందుకు అమ్మకాలు పెరిగాయి. ఈ సారి ఎందుకు తగ్గాయి. ఏటా 10 శాతం పెరుగుతూ ఉండాలి. అటువంటిది ఆదాయం ఎందుకు తగ్గిందంటూ అబ్కారీ శాఖ మల్లగుల్లాలు పడుతోంది. ఎక్సైజ్ శాఖ దీనిపై సమీక్షలు నిర్వహిస్తోంది. పండుగ సీజన్ వల్ల తగ్గిందంటూ సమీక్షల్లో జిల్లా అధికారులు చెబుతున్నారు. ఇవేమీ ఉన్నతాధికారులకు పట్టడం లేదు. గత నవంబరులో ఇదే రోజుకు భీమవరం డిపో పరిధిలో రూ.48.5 కోట్ల విలువైన మద్యం అమ్ముడుపోయింది. ఈ ఏడాది రూ.32 కోట్లకు తగ్గింది. అంటే మూడో వంతు తగ్గడంపై అబ్కారీ శాఖ ఉలిక్కిపడింది. పన్నేతర మద్యం ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి అవుతుందా ? అనే దానిపైనా ఆరా తీస్తున్నారు.

గత ఏడాది మోజు

వైసీపీ హయాంలో ప్రభుత్వ మద్యం పాలసీ అమలులో ఉండేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మళ్లీ ప్రైవేటు లైసెన్స్ విధానాన్ని తెచ్చారు. గత ఏడాది నుంచి అమలులోకి వచ్చింది. గత ఏడాది అక్టోబరులో ప్రైవేటు మద్యం షాపులు తెరిచారు. వ్యాపారం కొత్త కావడంతో షాపుల్లో నిల్వ చేయడానికి లైసెన్స్‌దారులు పోటీ పడ్డారు. ఎగబడి కొనుగోలు చేశారు. దాంతో డిపో నుంచి అమ్మకాలు పెరిగాయి. ఈసారి పరిస్థితి వేరు. నష్టాలు వస్తున్నాయంటూ లైసెన్స్‌దారులు ఘొల్లుమంటున్నారు. వచ్చిన ఆదాయమంతా మూడు నెలలకు ఒకసారి లైసెన్స్ ఫీజు చెల్లించడానికి సరిపోతోంది. మరోవైపు పర్మిట్ రూమ్‌ల కోసం అదనంగా రూ.2.50 లక్షలు చెల్లిస్తున్నారు. అధికారులు డిపో నుంచి కొనుగోలు చేయాలంటూ గతంలో ఒత్తిడి తెచ్చేవారు. ఈ సారి లైసెన్స్‌దారులు పూర్తిగా మొరాయించారు. కొనుగోలు చేసి నిల్వ చేసుకునేది లేదంటే.. ఎదురు తిరిగే పరిస్థితి నెలకొంది.

బెల్ట్ షాపులపై ఉక్కుపాదం

గత నెల నుంచి ఎక్సైజ్ శాఖ బెల్ట్ షాపులపై దాడులు చేస్తోంది. గ్రామాల్లో మద్యం అమ్మకాలు గ్గాయి. పాయింట్‌లు లేకుండా చేశారు. ఇది కూడా అమ్మకాలపై ప్రభావం చూపింది. ప్రస్తుత విధానంలో ప్రతి షాపు రూ.3 లక్షలు అమ్మితేనే గట్టెక్కుతారు. అటువంటిది సగటున రూ.1.50 లక్షల మద్యం అమ్ముడు పోతోంది. బెల్టు షాపులు లేకుండా చేయడంతో అమ్మకాలు మరింత తగ్గాయి. మళ్లీ సారా వినియోగం పెరుగుతోందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

నవంబరు 21 వరకు అమ్మకాలు ఇలా..

	గత ఏడాది	ఈ ఏడాది
లిక్కర్ కేసులు	64,545	41,797
బీర్ కేసులు	19,096	19,078
ఆదాయం	48.12	32.01

(రూ.కోట్లలో అమ్మకం)



ఉత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్ నాగరాణి

నేడు సత్యసాయి జయంతి వేడుకలు

భీమవరం టౌన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి):జిల్లాలో అధికారికంగా ఈ నెల 23న సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాలను నిర్వహిస్తున్నామని కలెక్టర్ నాగరాణి తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో సత్యసాయి సేవా సంస్థ ప్రతినిధులతో కలెక్టర్ సమావేశమయ్యారు. జిల్లాలో వాడవాడలా సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాలను నిర్వహించేందుకు సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని జిల్లాల్లో ఆదివారం బాబా శత జయంతి ఉత్సవాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లా కార్యక్రమాన్ని భీమవరం ఆకులవారి వీధి సత్యసాయి కల్యాణ మండపంలో ఉదయం 10.30 గంటల నుంచి నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఉత్సవాల ఆహ్వాన పత్రికను కలెక్టర్ ఆవిష్కరించారు. జేసీ రాహుల్, సత్యసాయి సేవా సంస్థల కన్వీనర్లు ఆర్వీఎస్ చలపతి, గుడివాడ కృష్ణ, కంతేటి వెంకటరాజు పాల్గొన్నారు.

నేడు హ్యాపీ సండే

- ముగిసిన కార్తీకం.. నేడు ఆదివారం
- 32 రోజుల తర్వాత మాంసాహార ప్రియులకు పండగ

తాడేపల్లిగూడెం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ముగిసింది. 20వ తేది అమావాస్య, 21 పోలి స్వర్గం, 22 శనివారం ఇలా వరుసగా పుణ్యదినాలు. పూజలతో భక్తులంతా ఉపవాసాలతో గడుపుతారు. ఈ 32 రోజులపాటు భక్తిభావంతో మాంసాహారం జోలికి వెళ్లకుండా నోరు కట్టేసుకున్నారు. ఇక కార్తీకం ముగిసి.. ఆదివారం రావడంతో.. ఈ రోజు కోసమే మాంసాహార ప్రియులంతా ఎదురుచూస్తున్నారు. మాంసాహారాన్ని లొట్ట లేసుకుని తినే సమయం దగ్గర పడిందని ఏం తినాలో ప్లాన్ చేసుకుంటున్నారు. నేటి ఉదయం నుంచి చికెన్, మటన్, చేపలు, రొయ్యల దుకాణాల వద్ద సందడి నెలకొననుంది. సాధారణంగా ఆదివారం వచ్చిందంటే ఎక్కువగా అందరూ ఇంటి వద్దే ఉంటారు. ఆ రోజు ముక్క లేకపోతే మాంసాహార ప్రియులకు గొంతు దిగదు. అప్పు చేసైనా ముక్క తెచ్చుకోవాల్సిందే. ఇప్పటి వరకు ఈ పరిస్థితులకు దూరంగా వుండి శాకాహారంతో కానిచ్చేశారు. ఇక ఈ రోజు ఇళ్లల్లో వండు కోవడమో, రెస్టారెంట్లకు వెళ్లడమో చేయనున్నారు.

పశ్చిమ గోదావరి జిల్లాలో మాంసాహారం వినియోగం ఇలా

- చికెన్ : సాధారణ రోజుల్లో 32 టన్నులు.. ఆదివారాల్లో వంద టన్నులు
- మటన్ : సాధారణ రోజుల్లో పది టన్నులు.. ఆదివారాల్లో 30 టన్నులు
- చేపలు : సాధారణ రోజుల్లో 15 టన్నులు.. ఆదివారాల్లో 40 టన్నులు



ధరలపై ప్రభావం

నెల రోజులుగా అమ్మకాలు తగ్గడంతో చికెన్ ధర కూడా కొద్దిగా తగ్గింది. స్కిన్ లెస్, విత్ స్కిన్ చికెన్ కిలో రూ.240 నుంచి రూ.200 మధ్య పలికింది. మటన్, చేప, రొయ్యల ధరలు తగ్గలేదు. హోల్‌సేల్‌గా తగ్గినా రిటైల్ చేపల వ్యాపారులు తగ్గించలేదు. చికెన్ విషయంలో కార్పొరేట్ సంస్థలు సిండికేట్‌గా మారి ధరపడకుండా చూసుకున్నాయి. ఏ మేరకు అవసరమో ఆ మేరకే కోళ్లను మార్కెట్ చేశాయి. గుడ్డు ధర ఇప్పటికే పెరిగింది. శనివారం సాయంత్రం వరకు చికెన్ ధర నిలకడగానే ఉంది. మరి ఆదివారం సేల్స్ పెరగడంతో ధర పెరిగే అవకాశాలు ఉన్నట్లు చెబుతున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా ఏలూరు చైత్ర ఆసుపత్రి నిర్వహణ

వైద్యంపై విజిలెన్స్

- గడువు తీరిన మందుల విక్రయం.. వినియోగం
- ఉచిత వైద్యానికి పరీక్షల పేరిట సొమ్ము వసూళ్లు
- అనుమతులు లేని భవనంలో ఆసుపత్రి
- పేషెంట్లు కట్టిన సొమ్ములకు ఇవ్వని బిల్లులు
- అనుమతులు లేకుండా యంత్రపరికరాల వినియోగం
- భవన నిర్మాణంలో లోపాలు.. రోడ్డుపైనే జనరేటర్
- విజిలెన్స్ ఆధ్వర్యంలో పలు శాఖల తనిఖీల్లో వెల్లడి



రోడ్డుపైనే పార్కింగ్.. జనరేటర్

ఏలూరు క్రైం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి):వైసీపీ హయాంలో అక్రమ మార్గాల్లో మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లిన ఏలూరు చైత్ర ఆసుపత్రి నేడు అదే బాణీలో పేదల నుంచి అడ్డగోలుగా దోచుకుంటున్నది. దీనిపై అందిన ఫిర్యాదుల మేరకు ప్రభుత్వం కన్నెర్ర చేసింది. రాష్ట్ర విజిలెన్స్ డీజీ ఆదేశాలతో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా విజిలెన్స్ ఎస్పీ కె.నాగేశ్వరరావు పర్యవేక్షణలో డీఎస్పీ ఎస్.వెంకటేశ్వరరావు, డీఈ శ్రీనివాసన్, ట్రాన్స్‌కో, వైద్య ఆరోగ్య శాఖ, అగ్నిమాపక, ఏలూరు టౌన్‌ప్లానింగ్, జిల్లా డ్రగ్స్ కంట్రోల్, విద్యుత్ శాఖ అధికారులు సంయుక్తంగా ఏకకాలంలో శనివారం ఉదయం ఏలూరు అశోక్‌నగర్‌లోని చైత్ర ఆసుపత్రిపై దాడి చేసి తనిఖీలు చేపట్టారు. 'తనిఖీల్లో ఆసుపత్రిలో గడువు తీరిన మందులు లభించాయి. రోగులకు బిల్లులు ఇవ్వడం లేదు. ఫలితంగా ప్రభుత్వానికి కట్టాల్సిన జీఎస్టీ చెల్లించడం లేదు. ఆరోగ్య శాఖ నుంచి అనుమతులు లేకుండా వైద్య యంత్ర పరికరాలు వినియోగిస్తున్నారు. ఎక్స్‌రే, అల్ట్రా సౌండ్ పరీక్షలకు అనుమతులు లేనప్పటికి పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఎన్టీఆర్ వైద్యసేవలో చేయాల్సిన ఉచిత ఆపరేషన్లకు వివిధ టెస్టుల పేరుతో సొమ్ములను వసూలు చేస్తున్నారు. భవన నిర్మాణంలో లోపాలు ఉన్నాయి. పార్కింగ్ స్థలంలో మెడికల్ షాపు, డాక్టర్ రూమ్ నిర్మించారు. రోడ్డుపైనే జనరేటర్ బిగించారు. రోడ్డును ఆక్రమించి పార్కింగ్‌గా వాడుతున్నారు. అనుమతికన్నా అక్రమంగా విద్యుత్ లోడును వినియోగిస్తున్నారు. అగ్ని ప్రమాదం జరిగితే మంటలను ఆర్పడానికి అవసరమైన పరికరాలు లేవని గుర్తించారు. వైద్యులు, సిబ్బందికి అర్హతలు, వేర్వేరు ఆసుపత్రుల్లో ఏమైనా రిజిస్టర్ అయ్యారా ? అనే కోణంలోను పరిశీలన చేస్తున్నారు. సాయంత్రం వరకు తనిఖీలు నిర్వహించి అక్కడి లోపాలపై ఏ శాఖకు ఆ శాఖ నివేదికలను సిద్ధం చేసి విజిలెన్సు అధికారులకు అందించారు. విజిలెన్సు ఎస్పీ కె.నాగేశ్వరరావు ఈ నివేదికను రాష్ట్ర ఉన్నతాధికారులకు పంపించనున్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న విజిలెన్సు డీఎస్పీ ఎస్.వెంకటేశ్వరరావు

కరోనా సమయంలో ఆసుపత్రిలో బాధితుల నుంచి అధిక మొత్తంలో సొమ్ములు వసూలు చేయడం, ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో వాడాల్సిన రెమిడిసివర్ ఇంజక్షన్లు ఈ ఆసుపత్రిలో ఉండడాన్ని గుర్తించి అప్పట్లో చర్యలు తీసుకున్నారు. దాడుల్లో విజిలెన్సు డీఎస్పీ సింగులూరి వెంకటేశ్వరరావు, విజిలెన్స్ డీఈ శ్రీనివాసన్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ విక్రమ్, విజిలెన్సు సీఐ గంగాభవాని, జీఎస్టీ అధికారి కృష్ణ తాతాజీ, డీఎంహెచ్‌వో శాఖ తరపున కావ్య, విజిలెన్స్ ఎస్‌ఐలు రంజిత్, నాగరాజు, ఏవో మీరయ్య పాల్గొన్నారు.



- ఆలయాలు, భజన మండళ్ల నిర్మాణాలకు టీటీడీ శ్రీవాణి ట్రస్టు నిధులు
- స్థలాన్ని బట్టి రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు కేటాయింపు
- దరఖాస్తులు స్వీకరిస్తున్న దేవదాయ శాఖ

గుడులు కట్టేద్దాం..!

భీమవరం టౌన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాలు నివసించే ప్రాంతాల్లో భజన మందిరాలు, దేవాలయాల నిర్మాణాలకు తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీ వాణి ట్రస్టు నిధులు మంజూరుచేస్తోంది. ఎవరైనా ఆలయాలు నిర్మాణం చేయదలుకుంటే దేవదాయ ధర్మదాయ శాఖ అధికారులను సంప్రదించాలి. దీనికి సంబంధించి ఎలాంటి చర్యలు తీసుకోవాలో ఇటీవల దేవదాయ ధర్మదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్ జిల్లా అసిస్టెంట్ కమిషనర్లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌ద్వారా సమీక్షించారు. శ్రీవాణి ట్రస్టు రాక ముందు వరకు కామన్ గుడ్ ఫండ్ (సీజీఎఫ్) ద్వారా దాతలు 33 శాతం నిధులు విరాళంగా ఇస్తే దానికి ప్రభుత్వం 67 శాతం నిధులు కలిపి నిధులు విడుదల చేసి ఆలయాల నిర్మాణాలు చేపట్టేది. ప్రస్తుతం ఈ విధానం కొనసాగుతున్నా ఎటువంటి నిధులు చెల్లించకుండా శ్రీ వాణి ట్రస్టు ద్వారా ఆలయాలను అభివృద్ధి చేస్తారు. ఆసక్తి వున్న వారు దరఖాస్తును దేవదాయ శాఖకు చేసుకోవాలి. అనుమతించిన ఆలయాలు, భజన మందిరాలను దేవదాయ శాఖ అందజేసిన నమూనా ప్రకారం గ్రామస్తులు, కాలనీ పెద్దలు నిర్మించుకోవచ్చు. స్థలాన్ని బట్టి రూ.15 నుంచి రూ.20 లక్షల వరకు మంజూరవుతాయి. గతంలో రూ.10 లక్షల వరకే ఇచ్చేవారు.

ఇప్పటికే 33 ఆలయాలు నిర్మాణం

గత ప్రభుత్వ హయాంలో శ్రీవాణి ట్రస్టు ద్వారా జిల్లాలో 33 దేవాలయాలు నిర్మించారు. ఒక్కొక్క దేవాలయానికి పది లక్షల చొప్పున మూడు కోట్ల 30 లక్షలు విడుదల చేశారు. వీటిలో పొన్నపల్లి, కలిగొట్ల, చింతలతోట, గుమ్మలూరు, తణుకు, రేలంగి, శృంగవృక్షం, అలమూరు, కరుగోరుమిల్లి, జగన్నాధపురం, కవురువారిపాలెం, గొల్లగూడెం, వెలివెల, వెంప, వెంకటాపురం, కొతాలపర్రు, ములపర్రు, పోలవరం, పండితవిల్లూరు, ఇలపకుర్రు, కొడమంచిలి, సద్దు కడపలలో రామాలయాలు, గుంపర్రు, కొప్పర్రు, పాలకొల్లుల్లో ఆంజనేయస్వామి ఆలయాలు, పాలమూరులో మురళీకృష్ణ ఆలయం, లిఖితపూడిలో తాళ్లమ్మ, రుస్తుంబాదలో అంకాలమ్మ, వరిదానంలో నేరేళ్లమ్మ, సిద్దాపురంలో శివాలయం, నాగిడిపాలెంలో భజన మందిరం, గరగపర్రులో వరసిద్ధి వినాయకుడి ఆలయాలు నిర్మించారు.

ఎక్కడ నిర్మించుకోవచ్చు

- కొత్తగా ఏర్పాటు చేసిన కాలనీలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, గిరిజన ప్రాంతాల్లో నిర్మాణాలకు ప్రాధాన్యత.
- దేవాలయాలు లేని, దూరంగా వున్న ప్రాంతాలకు ప్రాధాన్యత.
- జీర్ణోద్ధారణ దేవాలయాల పునరుద్ధరణకు శ్రీవాణి నిధుల మంజూరు.

స్థలాన్ని బట్టి మూడు కేటగిరీలు

- ఏ కేటగిరిలో రూ.10 లక్షలు
- బీ కేటగిరిలో రూ.15 లక్షలు
- సీ కేటగిరిలో రూ.20 లక్షలు
- మంజూరైన నిధులు మూడు విడతలుగా ఆలయాల కమిటీలకు అందజేత.

దరఖాస్తులు చేసుకోవచ్చు

- శ్రీ వాణి ట్రస్టు ద్వారా భజన మండళ్ల, ఆలయాల నిర్మాణాలకు స్థలం ఉంటే దరఖాస్తులు చేసుకోవచ్చునని దేవదాయ ధర్మదాయ శాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ సూర్యప్రకాశ్ తెలిపారు. ట్రస్టు మార్గదర్శకాలకు అనుగుణంగా నిధులు మంజూరు చేస్తామన్నారు.

మరో ఆరు నెలలు వీరే

- భీమవరం, పాలకొల్లు, తణుకు, తాడేపల్లిగూడెం మునిసిపాలిటీలకు ప్రత్యేకాధికారులు పొడిగింపు
- ఎన్నికలకు ప్రభుత్వం కసరత్తు

భీమవరం టౌన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి):మునిసిపాల్టీలకు ప్రత్యేకాధికారుల పాలనను మరో ఆరు నెలలు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. పాలకవర్గాలు లేని భీమవరం, పాలకొల్లు, తణుకు, తాడేపల్లిగూడెం మునిసిపాల్టీలకు ఆరు మాసాల క్రితం నియమించిన ప్రత్యేకాధికారుల గడువు ముగియడంతో దీనిని మళ్లీ పెంచారు. భీమవరం మునిసిపాల్టీకి ఆర్డీవో కె.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, పాలకొల్లుకు నరసాపురం ఆర్డీవో దాసి రాజు, తణుకుకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నారాయణరెడ్డి, తాడేపల్లిగూడెంకు ఆర్డీవో ఖతీబ్ కౌసర్ కొనసాగుతున్నారు. వారి ఆమోదంతోనే మున్సిపాలిటీల్లో పాలన సాగుతోంది.



గత ప్రభుత్వ హయాంలో న్యాయపరమైన చిక్కులు కారణంగా ఈ మున్సిపాలిటీలకు ఎన్నికలు నిర్వహించలేదు. అప్పటి నుంచి ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. ఈ నాలుగు మున్సిపాలిటీల్లో సమీప గ్రామాలను విలీనం చేస్తూ వైసీపీ ప్రభుత్వం జీవో జారీచేసింది. అక్కడ వార్డులు, ఓటర్లు, జనాభా సంఖ్య పెరిగింది. రిజర్వేషన్‌లను ప్రకటించారు. ఎన్నికల ముందే విలీన గ్రామాలపై హైకోర్టు స్టే విధించడంతో ఎన్నికలు జరగక పాలక వర్గాలు ఏర్పడలేదు. దీనివల్ల మున్సిపాలిటీలతోపాటు, విలీన గ్రామాలకు ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యాయి. పాలకవర్గాలు లేకపోతే కేంద్రం నుంచి ఆర్థిక సంఘం నిధులు మంజూరు కావు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆర్థిక వనరులపై దృష్టి పెట్టింది. వాయిదా పడ్డ మున్సిపాలిటీల్లో ఎన్నికలు నిర్వహిస్తామంటూ ఆ శాఖ మంత్రి

(మిగతా 6వ పేజీలో)

రైతన్నా.. మీ కోసం



- రేపటి నుంచి 29వ తేదీ వరకు
- ఇంటింటికి సచివాలయ సిబ్బంది
- అన్నదాతల సమస్యలపై ఆరా..
- ప్రభుత్వ పథకాలపై వివరణ
- వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు

నరసాపురం రూరల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ.. రైతుల ఆర్థిక ఉన్నతికి.. రాష్ట్ర ప్రభుత్వం 'రైతన్నా మీ కోసం' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. సోమవారం నుంచి 29వ తేదీ వరకు గ్రామాల్లోని రైతుల ఇళ్లను సచివాలయ సిబ్బంది సందర్శించి వారి సమస్యలు తెలుసుకుని, ప్రభుత్వం వారి కోసం తీసుకుంటున్న చర్యలు, అందిస్తున్న ప్రోత్సాహకాలను వివరిస్తారు. ఇందుకు సచివాలయాల వారీగా టీమ్‌లు ఏర్పాటుచేశారు. సుస్థిర వ్యవసాయ పద్ధతులు, రైతు అభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి అనుగుణంగా వ్యవసాయ, మత్స్య, ఉద్యాన పంటలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు అనుగుణంగా పంట రుణాలు, అన్నదాత సుఖీభవ, సబ్సిడీలపై పనిమట్లు అందించింది. ఈ క్రమంలో రైతులు తీసుకున్న రుణాలు, సబ్సిడీలు, సొమ్ములు సక్రమంగా వినియోగిస్తున్నారా ? ఇంకా సాగు అభివృద్ధికి ఏమైనా కావాలా ? రైతులు ఆర్థికంగా నిలబడేందుకు చేపట్టాల్సిన చర్యలు ఏమిటి ? మొదలైన అంశాలపై పది రోజులపాటు సర్వే నిర్వహించనుంది.

సీఎం అవగాహన

సర్వేపై శనివారం సీఎం చంద్రబాబుతోపాటు జిల్లా అధికారులు కిందస్థాయి సిబ్బందికి అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ గ్రామాల్లో పర్యటించి రైతు కుటుంబాలను సందర్శించాలి. ప్రభుత్వం ఇప్పటి వరకు వారికి ఇచ్చిన రుణాలు, సబ్సిడీలు, అన్నదాత సుఖీభవ సొమ్ము, పరికరాలు తదితర విషయాలపై సిబ్బంది వారితో మాట్లాడాలి. ప్రభుత్వం రైతులకు ఇస్తున్న సదుపాయాలు, సాగుకు అవసరమైన పరికరాలు తదితర విషయాలను అడగాలి. ఇంకా ప్రభుత్వం ఏం చేస్తే సాగు, రైతులు మరింత అభివృద్ధి చెందుతారన్న విషయాలపై సర్వే పక్కాగా నిర్వహించాలని సూచించారు.

ప్రతి గ్రామంలో టీమ్‌లు

సర్వేకు సచివాలయ సిబ్బంది టీమ్‌లుగా ఏర్పడనున్నారు. ఒక్కొక్క టీమ్‌లో ముగ్గురు చొప్పున ఉంటారు. వారు ప్రతి ఇంటి వద్ద అరగంట సేపు ఉండి వారితో మాట్లాడాలి. రైతుకు ఎంత భూమి ఉంది, అందులో వ్యవసాయం ఎంత, వాతావరణ పరిస్థితులు, మార్కెట్ ధర, పంట నష్టం, ఈకేవైసీ, ప్రభుత్వం పత్రికల ద్వారా రైతులకు అందించే ప్రకటనలు, సాగులో ఉప్పు శాతం, ప్రభుత్వ పథకాలు, రుణాలు, ఎస్సీ, ఎస్టీలకు నూరు శాతం సబ్సిడీ, భూ పరీక్షలు, ఇరిగేషన్, డ్రైనేజీ వ్యవస్థ, బ్యాంకు లింకేజీలు, ఆధార్ అనుసంధానం తదితర విషయాలను అడిగి తెలుసుకుని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. టీమ్‌లో వీఏఏ, వీహెచ్, వీఎస్‌ఏ, మత్స్య, పశువర్ధక, రెవెన్యూ, ఎనర్జీ, ఇంజనీరింగ్, రైతు, సొసైటీ, మార్కెట్ యార్డు సభ్యులు, సిబ్బంది టీమ్‌లో విధులు నిర్వహించనున్నారు. దీనిపై వ్యవసాయశాఖ ఏవో జ్యోషిలా మాట్లాడుతూ రైతును అభివృద్ధి చేయాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని తెలిపారు.

రైతులకు అవగాహన కల్పించాలి : కలెక్టర్

భీమవరం రూరల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి):ఈ నెల 24 నుంచి 29వ తేదీ వరకు 'రైతన్నా.. మీ కోసం' వారోత్సవాల నిర్వహణపై కలెక్టర్ నాగరాణి ఆర్డీవోలు, వ్యవసాయ, ఉద్యాన, పశు, మత్స్యశాఖల అధికారులు, తహసిల్దార్లు, ఎంపీవోలు, ఎంపీడీవోలతో శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రతి రైతుకు తెలియజేయాలన్నారు. నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రి-టెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వ మద్దతు వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. రైతుల ఇళ్ళకు అధికారులు, ప్రజాప్రతినిధులు వెళ్లి వారి అవసరాలు తెలుసుకోవాలన్నారు. కాన్ఫరెన్స్‌లో జేసీ టి.రాహుల్ కుమార్‌రెడ్డి, డీఆర్‌డీవో బి.శివన్నారాయణరెడ్డి, వ్యవసాయ శాఖ అధికారి జడ్.వెంకటేశ్వరరావు, డీసీవో కె.మురళీకృష్ణ పాల్గొన్నారు.

భీమవరం, తాడేపల్లిగూడెం మునిసిపాలిటీల్లో

24 నుంచి ఆటో మ్యుటేషన్

ఆస్తులు రిజిస్ట్రేషన్ అయిన వెంటనే పన్నుల్లో పేరు మార్పు

భీమవరం టౌన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి):సెలక్షన్ గ్రేడ్ మునిసిపాల్టీల్లో మ్యుటేషన్ విధానాన్ని సులభతరం చేశారు. తమ పేరిట పన్ను మార్పిడి కోసం మ్యుటేషన్ చేయించుకోవటానికి మునిసిపాల్టీల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసిన వెంటనే ఆస్తులు కొనుగోలుదారుని పేర ఆటోమేటిక్‌గా పన్ను మార్పు జరుగుతుంది. ఇప్పటి వరకు కార్పొరేషన్‌లలో మాత్రమే ఈ విధానం అమలులో ఉంది. ఈ నెల 24 నుంచి సెలక్షన్ గ్రేడ్ మునిసిపాల్టీల్లోను వర్తిస్తుంది. ఇందుకు మార్గదర్శకాలను విడుదలయ్యాయి. జనాభా, ఆదాయ వనరులు, మౌలిక వసతులు, విద్య, వాణిజ్య తదితర రంగాలను ప్రామాణికంగా తీసుకుని తాడేపల్లిగూడెం, భీమవరం మునిసిపాల్టీలను సెలక్షన్ గ్రేడులుగా గుర్తించారు. అయినప్పటికి స్థలం, నివాసాలు, వాణిజ్య సముదాయాల ఆస్తులు కొనుగోలుదారులు తమ పేరున రిజిస్ట్రేషన్ చేసుకున్న తర్వాత పన్ను మార్పిడి కోసం మునిసిపాల్టీల చుట్టూ తిరగాల్సి వచ్చేది. సిబ్బంది చేయి తడిపితే కానీ ఈ పనయ్యేది కాదు. తాజాగా ఈ రెండు మునిసిపాల్టీలో ఆటో మ్యుటేషన్ పద్ధతిని అమలులోకి తెచ్చారు. ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది. దీని వల్ల మునిసిపాల్టీలకు ఆదాయం పెరుగుతుంది. పన్ను బకాయిలు చెల్లించిన తర్వాతే రిజిస్ట్రేషన్‌లు జరుగుతాయి.

వైద్యుల నిర్లక్ష్యానికి ఇద్దరు బలి..!

సకాలంలో స్పందించకపోవడంతోనే వారు చనిపోయారని బంధువుల ఆందోళన - 7లో..

'న్యాయవాదులకు మెడికల్ ఇన్సూరెన్సు ఏర్పాటు చేయాలి'

తణుకు, నవంబరు22 (ఆంధ్రజ్యోతి): న్యాయవాదులకు మెడికల్ ఇన్సూరెన్సును ప్రభుత్వం ఏర్పాటు చేయాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. శనివారం బార్ అసోసియేషన్ కార్యాలయంలో ఐలూ జిల్లా కమిటీ సమావేశం జి.విజయభాస్కర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దిగ్గుపాటి రాజగోపాల్ మాట్లాడుతూ రాష్ట్రంలో 50 వేలమంది న్యాయవాదులు ఉన్నారని, వారిని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. న్యాయవాదులు కామన మునిస్వామి, కౌరు

బీఎస్ఎన్ఎల్‌తో తీవ్ర ఇబ్బందులు : బంగారయ్య

ఆకివీడు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : బీఎస్ఎన్ఎల్ మోసపూరిత ఆఫర్లతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమైక్య సహాధ్యక్షుడు బొబ్బిలి బంగారయ్య ధ్వజమెత్తారు. శనివారం ఆయన మాట్లాడుతూ జియో, ఐడియా, ఎయిర్‌టెల్ వంటి ప్రైవేటు సంస్థలు ధరలు పెంచుతూ వినియోగదారుల సేవలో ముందుకు వెళుతుంటే బీఎస్ఎన్ఎల్ మాత్రం రేట్లు తగ్గించి ఆఫర్లు ఇచ్చి సేవలందించకుండా మోసపూరిత ప్రకటనలు చేస్తుందన్నారు. ఇప్పటికైనా పనితీరు మార్చుకుని సరైన సేవలు అందించాలన్నారు.

కూటమి పాలనలో పేదలకు కార్పొరేట్ వైద్యం

» తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ



తణుకు, నవంబరు22(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ పాలనలో పేదలకు కార్పొరేట్ వైద్యం అందుబాటులోకి వచ్చిందని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. శనివారం క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలోని ఇటీవల నిర్వహించిన కంటి వైద్య శిబిరంలో తణుకు, పట్టణం, ఇరగవరం, అత్తిలి మండలాల నుంచి సుమారు రెండు వేల మంది వైద్య శిబిరంలో పాల్గొన్నార న్నారు. శిబిరంలో ఇప్పటివరకు 663 మందికి ఉచితంగా కళ్లజోళ్లు అందించడంతోపాటు 47 మందికి శస్త్ర చికిత్సలు చేసినట్లు వివరించారు.

ప్రభుత్వానికి ప్రజల ఆశీస్సులు ఉండాలి : బొలిశెట్టి



తాడేపల్లిగూడెంలో సీఎం సహాయ నిధి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే బొలిశెట్టి

తాడేపల్లిగూడెం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : రాబోయే రోజుల్లో కూటమి ప్రభుత్వానికి ప్రజల ఆశీస్సులు పుష్కలంగా ఉండాలని ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ కోరారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను బాధితు లకు అందజేశారు. కూటమి నాయకులు పాలూరి వెంకటేశ్వరరావు, అడపా ప్రసాద్, ఖైలవరపు రాంజేంద్రప్రసాద్, రవితేజ, పిల్లా రాంబాబు పాల్గొన్నారు.

అర్హులైన దివ్యాంగులకు పెన్షన్ అందిస్తా..

తాడేపల్లిగూడెంలోని క్యాంపు కార్యాలయంలో శనివారం కొంతమంది దివ్యాంగులు ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానసికంగా 95శాతం వికలాంగత్వం ఉంటే పూర్తిస్థాయి పెన్షన్ అందిస్తామన్నారు. డీసీహెచ్ఎస్ డాక్టర్ సూర్యనారాయణ, నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ జీవీకే మల్లికార్జునరావు, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ రవిపాల్ కలిసి దివ్యాగుల పరిస్థితిపై సమీక్షించారు.

గణపవరం గ్రామాభివృద్ధికి దాతల సాయం



శిథిలమైన గణపవరం గ్రామ పంచాయతీ భవనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ధర్మరాజు

గణపవరం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పీ4 కార్యక్రమ స్ఫూర్తితో గ్రామాభివృద్ధికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. గణపవరం టీడీపీ సీనియర్ నాయకుడు లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్ దెందుకూరి ప్రసాదరాజు శిథిలమైన గ్రామ పంచాయతీ స్థానంలో నూతన భవన నిర్మాణానికి రూ.65లక్షలు, ఇందిరమ్మ కాలనీలో వాటర్ ఫౌండేషన్ ఏర్పాటుకు రూ.20లక్షలు, గణపవరం, ఎస్సీపేట వాటర్ ప్లాంట్ నిర్మాణానికి రూ.20 లక్షలు విరాళంగా ప్రకటించారన్నారు. ఈ పనులను శనివారం స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి పరిశీలించారు. సర్పంచ్ మూరా అలంకారం, ఈవోపీఆర్డీ పల్లా సత్యనారాయణ మూర్తి, జనసేన మండల అధ్యక్షుడు తోట శ్రీనివాసరావు పాల్గొన్నారు.

భగవంతుని సేవ ఎంతో అదృష్టం : అంజిబాబు



ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారంలో ఎమ్మెల్యే అంజిబాబు

భీమవరంటౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : భగవంతుని సన్నిధిలో సేవ చేయడమంటే ఎంతో అదృష్టమని పాలకవర్గ సభ్యులు ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. భీమవరం శ్రీరాంపురంలోని శ్రీరామలింగేశ్వరస్వామి దేవస్థాన పాలకవర్గం సభ్యులు శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. ధర్మకరల చేత దేవదాయ ధర్మదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వి.వెంకటేశ్వరరావు ఆలయ చైర్మన్‌గా గుండు త్రివిక్రమమూర్తి, సభ్యులుగా వి.గురుమూర్తి, ఎస్.వెంకట సత్యవతి, టి.వెంకట కృష్ణగుప్తా, కె.కుమారి, కోడూరి రామకృష్ణ, ఎం.మహాలక్ష్మి, పి.రవితేజ ప్రమాణ స్వీకారం చేయించారు. ఆలయ ఈవో దండు కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : బాబ్జి



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న వలవల బాబ్జి

పెంటపాడు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని భవన కార్మిక సంక్షేమ మండలి చైర్మన్ వలవల బాబ్జి అన్నారు. శనివారం పట్టణంలోని టీడీపీ క్యాంపు కార్యాలయం వద్ద లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులను ఆయన అందజేసి మాట్లాడారు. రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపించేందుకు సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్ బాబు నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. గొర్రెల శ్రీధర్, ఆకాశపు స్వామి, కిలపర్తి వెంకట్రావు, దాసరి కృష్ణవేణి, ముత్యాల సత్యనారాయణ, పద్మనాభుని మురళి, దాట్ల జగన్నాథరాజు, షేక్‌బాజి పాల్గొన్నారు.

రైతులను ప్రభుత్వాలు ఆదుకోవాలి : బలరామ్

కాళ్ల, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): వరి ధాన్యం, ఆక్వా రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బి.బలరాం డిమాండ్ చేశారు. కాళ్లలోని సీపీఎం కార్యాలయంలో శనివారం విలేకరులతో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం వరి పంట మాసూళ్లు జరుగుతున్నాయని, వాతావరణంలో మార్పుల వల్ల రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. ప్రభుత్వం, జిల్లా అధికార యంత్రాంగం రైతాంగానికి సంచులు ఇచ్చి సహాయపడాలని కోరారు. ఆక్వా రైతులకు ఉచిత విద్యుత్‌ను వెంటనే అమలు చేయాలని కోరారు. సీపీఎం మండల కార్యదర్శి గొర్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మరో ఆరు నెలలు వీరే

(5వ పేజీ తరువాయి)

నారాయణ ప్రకటించారు. విలీన గ్రామాలను మినహాయించి పాత పద్ధతిలో ఎన్నికలు నిర్వహించేలా కసరత్తు చేశారు. కానీ ఆచరణకు నోచుకోలేదు.

అన్నింటికీ ఒకేసారి

రాష్ట్రంలో అన్ని మున్సిపాలిటీలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించేలా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. వచ్చే ఏడాది తొలి త్రైమాసికంలోనే ఈ ప్రక్రియ పూర్తి చేయనున్నట్టు ఎన్నికల సంఘం ప్రకటించింది. పాత పద్ధతిలోనే మున్సిపాలిటీల నుంచి వార్డులు, ఓటర్ల వివరాలను ఎన్నికల సంఘం కోరింది. అంటే విలీన గ్రామాలను మినహాయిస్తున్నట్టు స్పష్టత వచ్చింది. ఇప్పుడు మున్సిపాలిటీల రిజర్వేషన్లపైనే చర్చ సాగుతోంది. ఆశావహులు రిజర్వేషన్‌పై ఉత్కంఠతో ఉన్నారు. ఎన్నికలు జరిగే వరకు ప్రత్యేకాధికారుల పాలన కొనసాగనుంది. అందుకోసమే ప్రభుత్వం మరో ఆరు నెలలపాటు ప్రత్యేకాధికారుల పాలనా గడువును పెంచింది.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

» కలెక్టర్ నాగరాణి



పాలకొల్లు బైపాస్ రోడ్డులోని గురుకుల పాఠశాల హాస్టల్‌లో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ నాగరాణి

పాలకొల్లు రూరల్/భీమవరంటౌన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి):ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదువుకోవాలని విద్యతోనే ఉజ్వల భవిష్యత్తును ఏర్పరుచుకోవచ్చని జిల్లా కలెక్టర్ నాగరాణి అన్నారు. శనివారం పాలకొల్లు బైపాస్‌రోడ్డులోని గురుకుల పాఠశాలను, హాస్టల్‌ను ఆమె ఆకస్మికంగా సందర్శించి విద్యార్థులకు సూచించారు. ప్రతి రోజు క్రమం తప్పకుండా హోంవర్కు చేసి ఎప్పటి పాఠాలు అప్పుడే చదవడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. హాస్టల్‌లో భోజనం, వసతులుపై ఆమె విద్యార్థులను ఆరా తీసి, వారితో కలిసి భోజనం చేశారు. మెనూ ప్రకారం రుచికరమైన భోజనం ఏర్పాటు చేయాలని నిర్వాహకులను ఆదేశించారు. జిల్లా విద్యాధికారి ఎల్ఎల్‌బీ నారాయణ, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ ఆకుల సూరిబాబు, తహసీల్దార్ వై.దుర్గాకిషోర్, ఎంపీడీవో ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

● పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రిని ఆమె ఆకస్మికంగా సందర్శించారు. ప్రసూతి వార్డుల్లోని మహిళలతో మాట్లాడి ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. పురుషుల వార్డులను సందర్శించి రోగులతో మాట్లాడారు. అనంతరం నిర్మాణంలో ఉన్న ఆసుపత్రి భవనాన్ని పరిశీలించారు. ఎక్కడైనా డీసీహెచ్ఎస్ వి.సూర్యనారాయణ, ఆసుపత్రి సూపరింటెండెంట్ మాధురి, మునిసిపల్ కమిషనర్ బి.విజయసారథి తదితరులు పాల్గొన్నారు.

మానసిక రోగుల సంరక్షణకు కార్యక్రమం

జిల్లా రెడ్‌క్రాస్, మనోబంధు ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా తిరుగుతూ మానసిక రోగులను రక్షించడం, పునరుద్ధరించడం, కుటుంబాలతో మళ్లీ కలపడాన్ని లక్ష్యంగా పెట్టుకొని ప్రత్యేక కార్యక్రమాన్ని భీమవరంలో ఆమె జెండా ఊపి ప్రారంభించారు. 22 నుంచి 24 వరకు అన్ని మున్సిపాలిటీల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు తమ పరిసరాల్లో సహాయం అవసరమైన మానసిక రోగులను గుర్తించి 92465 68738 నంబరుకు సమాచారం ఇవ్వాలని కోరారు. భీమవరం కొత్త బస్టాండ్ ఆర్టీసీ కాంప్లెక్స్‌లో మరమ్మతుల్లో ఉన్న మరుగుదొడ్లను రూ.14.5 లక్షల వ్యయంతో తిరిగి మరమ్మతులు చేసిన అనంతరం శనివారం ఆమె ప్రారంభించారు. ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడంలో రాజీ పడవద్దు అని అధికారులను ఆదేశించారు.



పెనుగొండ పోలీసు సిబ్బందితో డీఎస్పీ శ్రీవేద

పెనుగొండ పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ తనిఖీలు

పెనుగొండ, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): నరసాపురం సబ్ డివిజన్ డీఎస్పీ డాక్టర్ శ్రీవేద శనివారం పెనుగొండ పోలీసు స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీలు చేశారు. వార్షిక తనిఖీలలో భాగంగా స్టేషన్‌లోని రిజిష్టర్లు, కేసు ఫైళ్లు, ఇతర రికార్డులను పరిశీలించారు. సిబ్బందితో సమావేశం నిర్వహించి పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తు పురోగతిని తెలుసుకుని, వాటిని వేగవంతం చేసి నిందితులకు శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలన్నారు. డ్రంకెన్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్‌పై ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి కేసులు నమోదు చేయాలన్నారు. పోలీసుస్టేషన్ పరిధిలో ప్రధాన ప్రదేశాలకు సీసీ కెమేరాలు ఏర్పాటు చేసి వాటి మానిటరింగ్ కోసం ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రజల్లో భద్రతాభావం పెంచేందుకు ఫ్రెండ్లీ పోలీసింగ్‌పై దృష్టి పెట్టాలన్నారు. స్టేషన్‌లో ఉన్న స్వాధీనం చేసుకున్న వాహనాల డిస్పోజల్‌ను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఎస్ఐ గంగాధర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల్లో అభ్యసన స్థాయి పెంచాలి : డీఈవో

ఇరగవరం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి):విద్యార్థుల్లో అభ్యసన స్థాయి పెంచాలని డీఈవో ఈ.నారాయణ అన్నారు. ఇరగవరం జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన క్లస్టర్ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. గతేడాది వచ్చిన ఫలితాలను పరిశీలించారు. ప్రతి సబ్జెక్టులోనూ మార్కులు సులభంగా సాధించే విధంగా తర్ఫీదు ఇవ్వాలన్నారు. విద్యా సంబంధిత విషయాల్లో ఇరగవరం మండలం ప్రథమస్థానంలో నిలవడం పట్ల ఉపాధ్యాయులను అభినందించారు. సమావేశంలో ఎంఈవోలు ప్రసాదరావు, శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయుడు మునీంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

కో-లొకేట్‌లో పైలట్ మండలంగా 'పెంటపాడు'

పెంటపాడు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ సెంటర్స్ కో-లొకేట్ చేసేందుకు గాను జిల్లాలోని పెంటపాడు మండలం పైలట్ మండలంగా ఎంపికయింది. ప్రైమరీ పాఠశాలల్లో అంగన్‌వాడీ విద్యార్థులను తీసుకువెళ్లి అక్కడ ఉంచడం కో-లొకేట్ ముఖ్య ఉద్దేశం. దీనికి ప్రథమంగా పెంటపాడు మండలాన్ని ఎంపిక చేశారు. ప్రైమరీ పాఠశాలలో అదనపు గదులు ఉంటే ఆ సమీపంలోని అంగన్‌వాడీ సెంటర్లకు సంబంధించిన అంగన్వాడీ విద్యార్థులను ఆ పాఠశాలకు పంపిస్తారు. ఒకవేళ గదులు లేకపోతే వాటి కోసం నూతన గదుల కోసం అధికారులకు ప్రతిపాదనలు పంపుతారు. గదులు కొరత ఉండే పాఠశాలల పరిధిలో ఉండే అంగన్వాడీ కేంద్రాలు ప్రస్తుతం ఎక్కడైతే జరుగుతున్నాయో అక్కడే కొనసాగుతాయి. కో-లొకేట్‌కు సంబంధించి తొలి ప్రణాళికగా పెంటపాడు పోస్టు బేసిక్ పాఠశాలలో శనివారం సమావేశం ఏర్పాటు చేసి నూతన కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ చైర్మన్‌గా ఎంఈవో శ్రీనివాస్, కో-చైర్మన్‌గా సీడీపీవో పద్మావతి, కమిటీ సభ్యులుగా అంగన్వాడీ సూపర్‌వైజర్లు, హెచ్‌ఎంలు తదితరులు ఉంటారు. ఈ కార్యక్రమం విజయవంతమైతే మరికొన్ని మండలాలలో కో-లొకేట్‌ను అమలు చేసేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.



'దారి దీపం' సంచికను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ ఏడుకొండలు

'విద్యార్థులకు రాజ్యాంగ విలువలు బోధించాలి'

తణుకు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : దేశాన్ని నడిపించే రాజ్యాంగాన్ని, దాని విలువలను విద్యార్థులకు బోధించాలని జిల్లా రాజ్యాంగ ప్రచార వేదిక కన్వీనర్ డీవీవీఎస్ వర్మ కోరారు. శనివారం ఎస్సీఐఎం డిగ్రీ కాలేజిలో అధ్యాపకులు-ప్రజా సంఘాల ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని సంస్థలు ఈనెల 26న రాజ్యాంగ దినోత్సవంలో పాలుపంచుకుని సామూహికంగా రాజ్యాంగ పీఠిక పఠనం-పీఠిక ప్రతిజ్ఞ నిర్వహించాలని చెప్పారు. మాజీ మున్సిపల్ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో భారత రాజ్యాంగ దినోత్సవం పై ప్రచురించిన 'దారిదీపం' సంచికను కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ ఏడుకొండలు ఆవిష్కరించారు. ప్రచార వేదిక సభ్యులు డాక్టర్ బి.రమేష్‌చంద్ర బాబు, విశ్రాంత ప్రిన్సిపాల్ సంకు మనోరమ, అడ్డాల సత్యనారాయణ, పేరూరి మురళీకుమార్, దక్షిణమూర్తి పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులకు రెమిడియల్ టీచింగ్ ఇవ్వాలి

పాలకొల్లు అర్బన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి) : ఎస్ఏ-వన్ పరీక్షల్లో తక్కువ మార్కులు వచ్చిన విద్యార్థులను గుర్తించి వారికి రెమిడియల్ టీచింగ్ ఇవ్వాలని ఎంఈవోలు గుమ్మళ్ల వీరాస్వామి, గంగాధర శర్మ సూచించారు. స్థానిక బీఆర్ఎంవీఎం హైస్కూల్లో పట్టణ పరిధిలోని క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశం కాంప్లెక్స్ చైర్మన్, బీఆర్ఎంవీఎం హైస్కూల్ హెచ్‌ఎం ఝాన్సీలక్ష్మీభాయి అధ్యక్షత వహించారు. డిసెంబరు 5న నిర్వహించే మెగా పేరెంట్స్ డే సమావేశ ఆవశ్యకతను వివరించారు. డిసెంబరు 6 నుంచి నిర్వహించే 100 రోజుల ప్రోగ్రాం విధి విధానాలను ఎంఈవోలు వీరాస్వామి, గంగాధర శర్మ వివరించారు. క్లస్టర్ కార్యదర్శి ఆర్.భవానీప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'దాతల సహకారం అభినందనీయం'

కాళ్ల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : గ్రామంలో ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనకు దాతల సహకారం అభినందనీయమని పెదఅమిరం గ్రామ సర్పంచ్ డొక్కు సోమేశ్వరరావు తెలిపారు. పెద అమిరంలోని నాగులకోడు మురుగు డ్రెయిన్‌పై అన్నా ఆదర్శనగర్ ప్రాంత ప్రజలు వెళ్లేందుకు వీలుగా దాతలు కనుమూరు రామకృష్ణంరాజు, గోపాలరాజు వారి తల్లిదండ్రులు జ్ఞాపకార్థం నిర్మించిన వంతెనను శనివారం పరిశీలించి మాట్లాడారు. ఈ ప్రాంతంలో డ్రెయిన్‌పై ఉన్న తూములను తొలగించడంతో దారి మార్గం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈమేరకు దాతలు సుమారు రూ. 3 లక్షలతో వంతెన నిర్మాణం చేపట్టినట్టు తెలిపారు. పనులు పూర్తికావడంతో దాతలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

'నాలుగు లేబర్‌కోడ్‌లను నిలుపుదల చేయాలి'



తణుకులో ఏఐటీయూసీ నాయకుల ధర్నా

తాడేపల్లిగూడెం/తణుకు/భీమవరంటౌన్/ఉండి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): లేబర్ కోడ్‌ల అమలు నిలుపుదల చేయకపోతే మరో దేశ వ్యాప్త ఉద్యమం తప్పదని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి సభ్యుడు డీఎన్‌వీడీ ప్రసాద్ కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. తాడేపల్లిగూడెంలోని ఆల్ ట్రేడ్ యూనియన్స్, ఉద్యోగ, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శనివారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, కార్మిక హక్కులను కాలరాస్తూ కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్లను కరోనా సమయంలో తయారు చేసిందని ఆరోపించారు. దీనివల్ల అన్ని రంగాల కార్మికులకు అన్యాయం జరగనుందని ఆందోళన వ్యక్తం చేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి సభ్యులు కర్రి నాగేశ్వరరావు, కరెడ్ల రామకృష్ణ, జవ్వాది శ్రీను, పోతు శ్రీను, షేక్‌వలీ రంగా ప్రజా నాట్య మండలి సభ్యులు పాల్గొన్నారు. తణుకు నరేంద్ర సెంటర్‌లో సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్ ఆధ్వర్యంలో లేబర్ కోడ్ ప్రతులను దహనం చేశారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కోనాల భీమారావు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. భీమవరంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికులు ఆందోళన చేశారు. మునిసిపల్ వర్కర్స్ యూనియన్ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కిలారి మల్లేశ్వరరావు, ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు మాట్లాడారు. ఉండి పెద్దవంతెన సెంటర్‌లో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జేఎన్వీ గోపాలన్, మండల అధ్యక్షుడు ధనికొండ శ్రీను ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. రామకరి వెంకటరత్నం, మాధవరావు, సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వర్లు, వజ్రం, కాల్వ యేసు తదితరులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ అసిస్టెంట్‌పై ఫిర్యాదు

ఆకివీడురూరల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): అజ్జమూరు పంచాయతీలో పనిచేస్తున్న ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఎంఎల్ నరసింహస్వామి విధులు సక్రమంగా నిర్వర్తించడం లేదని అజ్జమూరు సర్పంచ్ చలపతి, వార్డు సభ్యులు, గ్రామస్థులు ఎంపీడీవో బాబూరావుకు శనివారం ఫిర్యాదు చేశారు. విధులకు సక్రమంగా హాజరుకావడం లేదని, కుళాయిల ద్వారా విడుదల చేసే నీటిలో మోతాదును మించి బ్లీచింగ్ కలుపుతున్నారన్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే 'నా ఇష్టం వచ్చినట్లు చేస్తా, ఎవరికి బాధ్యత వహించాల్సిన అవసరం లేదని' దురుసుగా ప్రవర్తిస్తున్నారని తెలిపారు. ఉన్నతాధికారులు సదరు ఉద్యోగిపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. ఇదిలా ఉండగా ఆ ఉద్యోగి సర్పంచ్, గ్రామ పెద్దలపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలియవచ్చింది.

పంట దిగుబడి బాగా తగ్గింది.. రైతులను ఆదుకోండి



ఆచంట మండల పరిషత్ సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు అధికారులు,

ఆచంట, నవంబరు22(ఆంధ్రజ్యోతి): ఇటీవల వచ్చిన మొంథా తుఫాన్ కారణంగా కొన్ని పొలాలు పడిపోవడంతోపాటు, పొలాలకు తెగుళ్ల వచ్చి పంట దిగుబడి గణనీయంగా తగ్గిపోయిందని, ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని పలువురు సభ్యులు అన్నారు. శనివారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ దిగుమర్తి సూర్యకుమారి అధ్యక్షతన జరిగింది. పలువురు సభ్యులు మాట్లాడుతూ సార్వా పంటకు సంబంధించి తుఫాన్ కారణంగా పడిపోయిన పంట పొలాలకు అధికారులు అంచనా లు తయారు చేశారని ఆ తరువాత.. పొలాలకు తెగుళ్ల రావడంతో దిగుబడి ఎకరాకు పది బస్తాలు పైగానే తగ్గిపోయిందని ఎంపీటీసీ సుబ్రహ్మణ్యం అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. జడ్పీటీసీ ఉప్పలపాటి సురేష్‌బాబు, ఎంపీపీ దిగుమర్తి సూర్యకుమారి మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో జరిగే కార్యక్రమాలకు సంబంధించి అధికారులు ప్రజాప్రతినిధులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా అగౌరవ పరుస్తున్నారని ఈ పద్ధతిని పంచాయతీ కార్యదర్శులు సరిదిద్దుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం ఎంపీటీసీ బొక్కా సుబ్రహ్మణ్యం, ఎంపీడీవో బి.కృష్ణమోహన్ మాట్లాడారు. వైస్ ఎంపీపీలు యర్రగొప్పుల నాగరాజు, తాళం శ్రీనివాస్, ఎంపీడీవో బి.కృష్ణమోహన్, తహసీల్దార్ జి.కనకరాజు, ఏవో పూర్ణబాబ్జీతో పాటు పలువురు సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెంలో జనసేనలోకి భారీగా చేరికలు

తాడేపల్లిగూడెం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి) : జనసేన పార్టీలోకి శనివారం రాత్రి భారీ చేరికలు జరిగాయి. తాడేపల్లిగూడెం మునిసిపల్ మాజీ కౌన్సిలర్, గిరిజన సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సింగం సుబ్బారావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ సమక్షంలో పార్టీలో చేరారు. జనసేన పార్టీ సిద్ధాంతాలు, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పనితీరు నచ్చి తాడేపల్లిగూడెం, పెంటపాడు మండలాలకు చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు చేశారు. తొలుత రేలంగి చిత్రమందిర్ థియేటర్ నుంచి ర్యాలీగా బయలు దేరి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. కార్యక్రమంలో పెంటపాడు, తాడేపల్లిగూడెం పట్టణ జనసేన పార్టీ అధ్యక్షులు పుల్లా బాబి, వర్తనపల్లి కాశీ, కూటమి నాయకులు పైబోయిన వెంకట్రామయ్య, ఖైలవరపు రాజేంద్రప్రసాద్, పాలూరి వెంకటేశ్వరరావు, గుండుమోగుల సురేష్, చేపల రమేష్ పాల్గొన్నారు.

'అధికారులు విధులు సక్రమంగా నిర్వర్తించాలి'

ఆకివీడు, నవంబరు22(ఆంధ్రజ్యోతి): సచివాలయ అధికారులు విధులు సక్రమంగా నిర్వర్తించాలని డీఎల్‌డీవో వై.దోసిరెడ్డి అన్నారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వ పథకాల సర్వేలు, ఇంటి పన్నుల వసూళ్లు, ఆధార్, ఫోన్ నంబర్ల విషయాలపై నూరుశాతం పనులు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో బాబూరావు, ఈవోపీఆర్డీ మార్కండేశ్వరరావు తదితరులు ఉన్నారు.



పద్మావతి అమ్మవారికి సారె సమర్పిస్తున్న వావిలాల సరళాదేవి దంపతులు

పద్మావతి అమ్మవారికి సారె సమర్పణ

తణుకు, నవంబరు22(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో తిరుచానూరు పద్మావతి దేవి బ్రహ్మోత్సవాల సందర్భంగా వేంకటేశ్వరస్వామి, అమ్మవార్లకు సారె సమర్పించామని చేనేత కార్పొరేషన్ మాజీ అధ్యక్షురాలు వావిలాల సరళాదేవి, వెంకట రమేష్ దంపతులు తెలిపారు. శనివారం దేశ నలుమూలల నుంచి వచ్చిన పద్మశాలి ప్రముఖులు, పెద్దలు తిరుపతిలో ఉన్న అఖిల భారత పద్మశాలి కల్యాణ మండపం నుంచి చీర సారె, పసుపు, కుంకుమలు ఆలయ ప్రాంగణంలో సమర్పించినట్లు తెలిపారు. మాజీ మంత్రి మురుగుడు హనుమంతరావు, అఖిల భారత పద్మశాలీల సంఘ నాయులు పాల్గొన్నారు.

ఆరుగొలను నుంచి శబరిమలైకు ..

తాడేపల్లిగూడెంరూరల్,నవంబరు22 (ఆంధ్రజ్యోతి): ఆరుగొలను గురుస్వామి ధనకృష్ణ ఆధ్వర్యంలో భారీగా అయ్యప్ప మాలధారులు శబరిమలైకు శనివారం పయనమయ్యారు. ఈ సందర్భంగా స్వాములు భక్తిశ్రద్ధలతో ఇరుముడి కార్యక్రమాలు నిర్వహించారు. మాజీ సర్పంచ్ నూకల బుల్లియ్య దంపతులు అయ్యప్పస్వాములకు పూలమాలలు వేసి వీడ్కోలు పలికారు.

మావుళ్లమ్మకు బంగారం అందజేత

భీమవరంటౌన్: మావుళ్లమకు భీమవరానికి చెందిన మానేపల్లి సత్యవతి సుమారు లక్ష రూపాయలు విలువ చేసే 8 గ్రాముల బంగారాన్ని అందించారు. కత్తవపాడుకి చెందినకొండలరావు ఇరవై ఐదు వేలు రూపాయలు విలువ గల రెండు గ్రాముల బంగారం విరాళంగా అందజేశారు.

మునిసిపల్ కాంట్రాక్టర్ల ఆందోళన వాయిదా

భీమవరంటౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : భీమవరం మునిసిపాల్టీలో కాంట్రాక్టర్లకు రావాల్సిన బకాయిలు చెల్లింపులో కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు చొరవ చూపించి సమస్య పరిష్కారంలో సహకరిస్తున్న నేపథ్యంలో తాము చేపట్టాల్సి ఆందోళనను వాయిదా వేస్తున్నామని మునిసిపల్ కాంట్రాక్టర్ల సంఘం అధ్యక్షుడు కపిలేశ్వరరావు తెలిపారు. కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ రాష్ట్ర మునిసిపల్ మంత్రి నారాయణతోనూ, డీఎంఏతోను స్వయంగా మాట్లాడిన నేపథ్యంలో సమస్యకొల్కివచ్చే పరిస్థితి ఉన్నందున వాయిదా వేశామన్నారు.

'వీఆర్‌ఏల సమస్యలను పరిష్కరించాలి'

ఇరగవరం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ డిసెంబరు 16వ తేదీన విజయవాడలోని సీసీఎల్‌ఏ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జేఏసీ యాక్షన్ కమిటీ కార్యదర్శి బి.గణేశ్వరరావు కోరారు. తాడేపల్లిగూడెం డివిజన్ వీఆర్‌ఏలతో ఇరగవరం మండలంలో మండల అధ్యక్షుడు కట్టుంగ కోటేశ్వరరావు అధ్యక్షతన శనివారం సమావేశం నిర్వహించారు. జిల్లాలోని అటెండర్, నైట్ వాచ్‌యన్, వీఆర్‌వో, డ్రైవర్ పోస్టుల్లో వీఆర్‌ఏల ద్వారా భర్తీ చేయాలన్నారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బీవీఏవీ పండు, జిల్లా సెక్రటరీ మూటూరి మోషే, భీమవరం డివిజన్ ప్రెసిడెంట్ సుబ్బారావు, లంకపల్లి శ్రీకాంత్, విఆర్‌ఏలు పాల్గొన్నారు.

'స్కూటీల ఉచిత పంపిణీకి గడువు పెంచాలి'

ఆకివీడు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగుల మూడు చక్రాల పెట్రోల్ స్కూటీల ఉచిత పంపిణీకి దరఖాస్తులు గడువు డిసెంబరు నెలాఖరు వరకు పెంచాలని ఏపీ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు అల్లాడి నటరాజ్ అన్నారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ అధికారుల సంతకాలు, సర్వర్ల సమస్యల వల్ల ఆలస్యం అవుతున్నందున సమయం పెంచాలన్నారు. విద్యార్హతలతో సంబంధం లేకుండా అధికారులు చూడాలన్నారు. వైకుంఠరావు, శ్రీనివాస్ ఉన్నారు.



ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మొక్కలు తొలగించిన దృశ్యం

ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పొదలు తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తణుకు రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పైడిపర్రు ఎస్సీ కళాశాల వసతి గృహాల సమీపంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పెరిగిపోయిన చెట్లను విద్యుత్ శాఖ సిబ్బంది శనివారం తొలగించారు. ఈనెల 21న ఆంధ్రజ్యోతిలో 'పొదల్లో ట్రాన్స్ ఫార్మర్' శీర్షికన ప్రచురితమైన వార్తకు స్పందించిన విద్యుత్ శాఖ సిబ్బంది ట్రాన్స్ ఫార్మర్ చుట్టూ అల్లుకున్న పిచ్చి చెట్లను తొలగించారు. ఈమేరకు చుట్టుపక్కల నివాసితులతో పాటు హాస్టల్ విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

'జాబ్ కార్డులు ఇవ్వాలి'

ఇరగవరం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకానికి అర్హులైన ప్రతి ఒక్కరికి జాబ్‌కార్డు ఇవ్వాలని ఇరగవరం ఎంపీడీవో ఎ.శ్రీనివాసరావు అన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి పథకం గ్రామ సభలు పంచాయతీల్లో నిర్వహించారు. ఇరగవరంలో ఎంపీడీవో హాజరై మాట్లాడారు. జాబ్ కార్డు చేర్పులు, తొలగింపు అంశాలపై శ్రామికులకు వివరించారు. కొత్తవారికి జాబ్ కార్డులకు దరఖాస్తులు స్వీకరించారు.

SUPER HIT నేడే చూడండి



విమ్యాక్స్ - ఏలూరు 11.00,2.30,6.30
ప్రత్యూష - తణుకు 2.30,6.30
పద్మాలయ - భీమవరం 2.30,6.30
గౌరి - చింతలపూడి 2.30,6.30
మారుతి - పాలకొల్లు 2.30,6.30
పద్మా - జంగారెడ్డిగూడెం 2.30,6.30

DNR COLLEGE ASSOCIATION
COLLEGE OF LAW: BHIMAVARAM-534202.
LAW ADMISSIONS UNDER CAT-B

Applications are invited to fill the following vacancies in UG/ PG Law Courses as per the Guidelines issued by the Competent Authority, **APSCHE** for the academic year **2025-2026** and all admissions are subjected to relevant GOs. The Last date for submitting application at the college office is **25.11.2025** before 2 PM.

COURSE	LL.B	BA.LL.B	BBA.LL.B	LL.M CLO	LL.M CL
CATAGORY					
CAT-B	48	12	12	4	4

Dr.Y.ASHOK KUMAR, PRINCIPAL I/C | M.V.KRISHNAM RAJU, COORDINATOR | G. SATYANARAYANA RAJU, SECRETARY AND CORRESPONDENT

పాలకొల్లులో అభివృద్ధి పనుల పరిశీలన


రామగుండం పార్కును పరిశీలిస్తున్న మంత్రి నిమ్మల

పాలకొల్లు అర్బన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల మాట్లాడుతూ మహిళలు సొంత ఇంటి కల టిడ్కో గృహాలేనని, నాతొలి ప్రాధాన్యత ఈ గృహాల నిర్మాణమేనని అన్నారు. పట్టణంలో కోట్లాది రూపాయలతో నిర్మాణంలో ఉన్న పనులను కూటమి నాయకులతో కలిసి మంత్రి నిమ్మల మోటారు సైకిల్‌పై వెళ్ళి పరిశీలించారు. ముందుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవనం, గౌడ శెట్టిబలిజ కమ్యూనిటీ భవనం, ముస్లిం షాదీఖానా, క్రిస్టియన్ శ్మశాన వాటిక, అబ్దుల్ కలాం పార్కు, రామగుండం పార్కు, 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి భవన నిర్మాణ పనులను పరిశీలించారు.

పవన్ కల్యాణ్ పర్యటన ఏర్పాట్లు పరిశీలన


విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిర్రి బాలరాజు

ద్వారకాతిరుమల, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ఈ నెల 24న ద్వారకా తిరుమల మండలంలోని ఐఎస్ జగన్నాథపురం లక్ష్మీ నరసింహస్వామి ఆలయం వద్ద అభివృద్ధి పనుల శంకుస్థాపనకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రానుండటంతో ఆయన పర్యటన ఏర్పాట్లను ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు శనివారం పరిశీలించారు. హెలీప్యాడ్ నిర్మాణాన్ని, భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కొయ్యలగూడెం: పవన్‌కల్యాణ్ పర్యటన విజయవంతం చేయాలని పోలవరం ఎమ్మెల్యే బాలరాజు కోరారు. ఈ మేరకు ఆయన పర్యటన ప్రాంతాన్ని పరిశీలించి శనివారం సాయంత్రం ఆయన కొయ్యలగూడెంలో విలేకరులతో మాట్లాడారు. అధికారులు, కూట మి నాయకులంతా పాల్గొనాలన్నారు. అయితే భద్రత దృష్ట్యా అధినేతను నేరుగా కలిసే అవకాశాలు లేవని కూటమి నాయకులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

గణపవరం మండలాన్ని ఏలూరు జిల్లాలో కలపండి

గణపవరం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి):ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా గణపవరం మండలాన్ని ఏలూరులో కలిపేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు తెలిపారు. శనివారం జరిగిన గణపవరం గ్రామసభలో గణపవరం మండలానికి చెందిన అఖిలపక్ష కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు ఆయనకు వినతిపత్రాన్ని ఎమ్మెల్యే అందించారు. ఆనాటి వైసీపీ ప్రభుత్వం గణపవరం మండలాన్ని భీమవరం డివిజన్‌లో కలుపుతూ ఉత్తర్వులు జారీ చేసిందని, గణపవరం మండలం ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి వరకు పోలీసు, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, సాంఘిక సంక్షేమశాఖ సేవలు ఏలూరు జిల్లాలోనే కొనసాగుతున్నాయని ఈ సందర్భంగా వారు స్పష్టం చేశారు.

జాతీయస్థాయి యోగా పోటీలకు రమాదేవి



ఉండి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి):జాతీయస్థాయి యోగా పోటీలకు రమాదేవి ఎంపికయ్యారు. చెరుకువాడ హైస్కూల్‌లో హిందీ పండిట్‌గా ఆమె పని చేస్తున్నారు. విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియంలో శుక్రవారం సివిల్ సర్వీసెస్ రాష్ట్రస్థాయి యోగా పోటీలు నిర్వహించారు. ఈపోటీలలో రమాదేవి ప్రతిభ కనబరచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. రానున్న జనవరిలో గోవాలో నిర్వహించే జాతీయస్థాయి యోగా పోటీలకు ఆమె హాజరవుతారు.

విద్యార్థులకు విజయకేతనం పుస్తకాలు అందజేత



పుస్తకాలు విడుదల చేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ, ఎమ్మెల్యే చంటి

ఏలూరుసిటీ, నవంబరు 22(ఆంధ్రజ్యోతి):నిరుపేద విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు పెంచే లక్ష్యంగా విజయకేతనం 3.0 పుస్తకాలు 100 రోజుల ప్రణాళిక ఆధారంగా రూపకల్పన చేయటం జరిగిందని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీప్రసాద్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శనివారం విజయకేతనం 3.0 స్టడీ మెటీరియల్ పుస్తకాలను జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీప్రసాద్, ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య(చంటి) విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సంవత్సరం జిల్లా పరిషత్ నిధులతో 30,327 పుస్తకాలు పేద విద్యార్థులకు పంపిణీ చేస్తున్నామని చెప్పారు.

25న జడ్పీ సమావేశం

ఈనెల 25వ తేదీ ఉదయం 10గంటల నుంచి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ స్థాయి సంఘ సమావేశాలు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అధ్యక్షతన జరుగుతాయని జడ్పీ సీఈవో ఎం. శ్రీహరి తెలిపారు. అదే రోజు మధ్యాహ్నం రెండు గంటల నుంచి జడ్పీ సర్వసభ్య సమావేశం జరుగుతుందన్నారు.


నృత్యోత్సవాల కరపత్రాలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

వచ్చే నెల 26 నుంచి జాతీయ నృత్యోత్సవాలు

ఏలూరు రూరల్, నవంబరు 22, (ఆంధ్రజ్యోతి): ఏలూరు నగరానికి చెందిన ప్రముఖ నృత్య సంస్థ అభినయ నృత్యభారతి 30వ జాతీయ నృత్యోత్సవాలు, నృత్య పోటీలు డిసెంబర్ 26, 27, 28 తేదీలలో వై.ఎం.హెచ్ఏ హాల్‌లో వైభవంగా నిర్వహించనున్నట్లు సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి, నాట్యాచార్య దువ్వి హేమసుందర్, ఆహ్వాన సంఘం కార్యదర్శులు లేళ్ల వెంకటేశ్వరరావు, దువ్వి రామారావు తెలిపారు. ఈసందర్భంగా పోటీల కరపత్రాలను ఆవిష్కరించారు. నృత్యోత్సవాలకు సుమారు 10 రాష్ట్రాల నుంచి శాస్త్రీయ నృత్య కళాకారులు పాల్గొం టారని నృత్య పోటీలకు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి 500 మంది చిన్నారి నర్తకులు విచ్చేసి వారి ప్రతిభ కనబరనున్నారని తెలిపారు. అనంతరం నృత్యకౌముది, సేవా తపస్వి, నృత్య తపస్వి, వంటి అవార్డులతో పాటు గెలుపొందిన చిన్నారులకు నగదు బహుమతులు, ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేస్తామన్నారు.

ANDHRA JYOTHI AJC CLASSIFIEDS
ఆంధ్రజ్యోతి
DAILY CLASSIFIEDS
క్లాసిఫైడ్స్ (ప్రతిరోజు)

FINANCE
గవర్నమెంట్ రిటైర్డ్ పెన్షనర్స్‌కు (కేంద్ర/ రాష్ట్ర), ప్రభుత్వ ఉద్యోగస్తులకు (కేంద్ర / రాష్ట్ర) సులభ వాయిదాల పద్ధతిలో వెంటనే ఫైనాన్స్ చేయబడును. వెంకటేశ్వర ఫైనాన్స్. Govt. Reg.No.176/2019. Cell: 9550648668
AJD:244848

పాఠకులకు ముఖ్య గమనిక
పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడీవీటీ





పుల్లెపువారి వీధిలో గతంలో రోడ్డు ఇలా వుండగా.. నేడు సీసీ రోడ్డు, డ్రెయినేజీల నిర్మాణం చేస్తున్న దృశ్యం

పన్నెండేళ్ల రోడ్డు సమస్యకు పరిష్కారం

తణుకు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 22వ వార్డులో దీర్ఘకాలంగా ఉన్న పలు సమస్యలు కూటమి ప్రభుత్వంలో పరిష్కారం అయ్యాయి. ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ నిధులు మంజూరు చేయడంతో వార్డులోని పలు సమస్యలు పరిష్కారం అయ్యాయి. 2014లో మునిసిపల్ కౌన్సిల్‌లో కౌన్సిలర్‌గా కీర్తి శివప్రసాదు అప్పట్లో పుల్లెపువారివీధి, నల్లజర్లవారి వీధిలో సీసీ రోడ్లు, డ్రెయిన్‌లు, తాగునీటి పైపులైన్లకు నిధులు మంజూరు చేయించారు. పనులు చేసే సమయంలో అప్పటి వైసీపీ ప్రభుత్వం పనులను రద్దు చేసింది. తర్వాత మరలా పనులు చేసిన దాఖలాలు లేవు. దీంతో వార్డు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడిన సందర్భాలు ఉన్నాయి. మరలా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మాజీ కౌన్సిలర్ కీర్తి శివ ప్రసాదు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ దృష్టిలో పెట్టగా వెంటనే రూ.64లక్షలు మంజూరు చేశారు. సీసీ రోడ్లు, డ్రెయిన్‌లు, తాగునీటి పైపులైన్ల నిర్మాణం పూర్తి చేస్తున్నారు. దీంతో ఆయా వార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎంతో కాలంగా ఉన్న సమస్య పరిష్కరించినందుకు ఎమ్మెల్యే రాధాకృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు.

అడిగిన వెంటనే నిధులు మంజూరు



కీర్తి శివ ప్రసాదు, మాజీ కౌన్సిలర్

కూటమి ప్రభుత్వం అధికా రంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ దృష్టిలో పెట్టగానే మునిసిపల్ అధికారులతో మాట్లాడి నిధులు మంజూరు చేయించారు. గతంలో మంజూరైన పనులను నిలిపివేసిన సందర్భాలు గురించి వార్డు ప్రజలకు అందరికి తెలుసు. అయితే ప్రస్తుతం పనులు జరుగుతున్నందున వార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఉప్పులూరులో జ్వరాలు తగ్గుముఖం


జ్వర పీడితుడితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో గీతాబాయి

ఉండి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, జ్వరాలు కంట్రోల్ అయ్యాయని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్‌జి.గీతాబాయి అన్నారు. ఇటీవల గ్రామంలో జ్వరాలు ప్రబలడంతో ఆమె విచారణ నిమిత్తం శనివారం ఉండి మండలం ఉప్పులూరు గ్రామాన్ని సందర్శించారు. జ్వర పీడితులను పరామర్శించారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామంలో బ్లీచింగ్ చల్లించాలని, అలాగే ప్రతి రోజూ సాయంత్రం ఫాగింగ్ చే యాలని సూచించారు. గ్రామం మధ్యలో వాడ కం చెరువులోని చెత్త, నాచు, నీటిని తొలగిం చాలని సూచనలు చేశారు. ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. ప్రజలకు అందు బాటులో వైద్యసేవలు ఏర్పాటుచేశామని, ఆందో ళన చెందవద్దన్నారు. వైద్యాధికారులు బెన్నీ సామ్యూల్, కీర్తన మాట్లాడుతూ స్థానికులు 8 మందికి జ్వర పరీక్షలు జరిపినట్లు, అందులో ముగ్గురు జ్వరంతో ఉండగా వారికి మందులు ఇచ్చినట్టు తెలిపారు. సర్పంచ్ యర్రా దుర్గారావు, ఎంపీడీవో శ్రీనివాస్, జిల్లా మలేరియా అధికారి వి.క్రాంతికుమార్, సబ్ యూనిట్ ఆఫీసర్ ఎస్ఎస్ఎన్ మూర్తి, ఏఎంవో నాగబాబు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు. శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణ రాజు ఆదేశాలతో ఉప్పులూరు గ్రామాన్ని అధికారులు సందర్శించి ప్రజల ఆరోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నారు. ఆరురోజులు ఈ ప్రాంతంలో యండగండి వైద్యాధికారులు శిబిరం ఏర్పాటు చేశారు.

వృత్తి విద్యతో స్వయం ఉపాధి సుగమం

ఏలూరు అర్బన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న వృత్తి విద్యా కోర్సులను బోధించే ఇన్‌స్ట్రక్టర్లకు శనివారం ఏలూరులో జిల్లాస్థాయి ఓరియంటేషన్ ప్రోగ్రాంను నిర్వహించారు. సమగ్ర శిక్ష జిల్లా ఏపీసీ కె.పంకజ్‌కుమార్ మాట్లాడుతూ వృత్తి విద్యాకోర్సులు భవిష్యత్తులో పదో తరగతి, ఇంటర్మీడియట్ బాలబాలికలకు ఏ విధంగా జీవనోపాధికి ఉపయోగపడుతుందో వివరించారు. దుస్తుల తయారీ, బ్యాంకింగ్ ఫైనాన్స్ అండ్ ఇన్సూరెన్స్, ఆటోమోటివ్, వ్యవసాయం, రిటైల్ రంగం, ఐటీ, హెల్త్‌కేర్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల్లో అందిస్తోన్న శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా వారిని ప్రోత్సహించాలని కోరారు. సమగ్ర శిక్ష జీసీడీవో నవీనకుమారి మాట్లాడుతూ జిల్లాలో 31 పీఎంశ్రీ హైస్కూళ్లు, 7 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఈ ఏడాది 6584 మంది విద్యార్థులకు వృత్తివిద్యా కోర్సుల్లో శిక్షణ నిస్తున్నట్టు తెలిపారు.

పాఠశాలకు పూర్వ విద్యార్థి రూ.5 లక్షల విరాళం


రూ.5లక్షల విరాళం చెక్కు అందిస్తున్న పాండురంగారావు దంపతులు

మొగల్తూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): తాను చదువుకున్న పాఠశాల అభివృద్ధి కోసం పూర్వ విద్యార్థి ముందుకు వచ్చారు. పేరుపాలెంకు చెందిన మేళం పాండురంగారావు కెపిపాలెం ఉన్నత పాఠశాలలో చదివి ఎంబీబీఎస్ పూర్తి చేశారు. వైద్య వృత్తిలో స్థిరపడ్డారు. తాను చదివిన కెపిపాలెం ఉన్నత పాఠశాలలో జూనియర్ కళాశాలగా అభివృద్ధి చేయడంతో ఆ పాఠశాల విద్యార్థులను ప్రోత్సహించేందుకు రూ.5లక్షల చెక్కును హెచ్ఎం పితాని ఇందిరకు అందించారు. దాత భార్య యతిరాజవల్లి, కుమారులు సతీష్, బెనర్జీ, నాగ చంద్రశేఖర్ కుటుంబ సభ్యు లు ప్రసూన, నీలిమ, పులపర్తి దుర్గా ప్రసాద్, పద్మ లావణ్య, హర్షిత్ పాల్గొన్నారు.

వైద్యుల నిర్లక్ష్యానికి ఇద్దరు బలి..!

రెండు వేర్వేరు ఘటనల్లో బంధువుల ఆరోపణలు

తాడేపల్లిగూడెం ప్రైవేటు ఆస్పత్రి వద్ద ఉద్యోగుల ఆందోళన


మునిసిపల్ ఉద్యోగుల ఆందోళన


ఆస్పత్రిలో శ్రావణి.. కుమారుడిని పట్టుకుని రోదిస్తున్న భర్త..

తాడేపల్లిగూడెం రూరల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి):గుండె నొప్పి అంటూ ఆసుపత్రికి వెళ్ళిన మహిళ వైద్యుల నిర్లక్ష్యంతో ప్రాణాలు కోల్పో యిన ఘటన తాడేపల్లిగూడెం పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చోటు చేసుకున్నది. మృతురాలి బంధువులు తెలిపిన వివరాలివి. తాడేపల్లిగూడెం మున్సిపల్ కార్యాలయంలో సంచర్ల శ్రావణి(35) శనివారం ఉదయం విధు లకు హాజరైంది. తనకు గుండె నొప్పి వస్తుందని తాడేపల్లిగూడెంలో గుండె కు సంబందించిన వైద్యం అందించే ఆసుపత్రికి వెళ్లింది. ఉదయం 11 గం టలకు వెళ్లిన ఆమెకు వైద్యులు గ్యాస్ సమస్య అంటూ వైద్యం మొదలు పెట్టారు. చికిత్స చేస్తుండగా శ్రావణి అపస్మారక స్థితికి చేరుకున్నది. దీంతో వైద్యులు కంగారు పడి శ్రావణి కుటుంబ సభ్యులతో రూ.40 వేలు ఖరీదు చేసే ఇంజక్షన్ చివరి నిమిషంలో అందించినా ఉపయోగం లేకుండా పోయింది. ఆమె మృతి చెందిందంటూ వైద్యులు చెప్పడంతో శ్రావణి బంధువులు, మున్సిపల్ సిబ్బంది ఒక్కసారిగా ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆసుపత్రి వద్ద నిరసన తెలిపారు. సకాలంలో ఆసుపత్రికి వచ్చినా వైద్యుల నిర్లక్షం కారణంగా ప్రాణాలను నిలబెట్టలేక పోయారని బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు. కుమారుడు వర్షిత్‌ను పట్టుకుని శ్రావణి భర్త రోదిస్తున్న తీరు చూపరులను కలచివేసింది.

నరసాపురంలో హైవేపై బంధువుల ఆందోళన


నరసాపురంలో ఎమ్మెల్యే నాయకర్‌తో మాట్లాడుతున్న మృతుడి బంధువులు

నరసాపురం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యంతో వ్యక్తి మృతి చెందాడని ఆరోపిస్తూ శనివారం బంధువులు 216 హైవే రోడ్డుపై ఆందోళన చేపట్టారు. మొగల్తూరుకు చెందిన ఫణీంద్ర(21) శనివారం మధ్యాహ్నం పాలకొల్లు రోడ్‌లోని ఇసుక ర్యాంపు వద్ద బొలేరో వాహనం ఢీకొట్టడంతో గాయాలపాలయ్యాడు. బంధువులు వెంటనే నరసాపురం ప్రభుత్వాస్పత్రికి తీసుకొచ్చారు. ఆస్పత్రి వైద్య సిబ్బంది సరిగ్గా పట్టించుకోకపోవడంతో భీమవరం తీసుకెళ్లారు. మార్గమధ్యలో ఫణీంద్ర మృతి చెందాడు. దీంతో మృతదేహంతో ఆస్పత్రికి తీసుకొచ్చి కొద్దిసేపు ఆందోళన చేపట్టారు. 216 రహదారిపై బంధువులతో కలిసి ఆందోళన చేపట్టారు. గంటపాటు ఆందోళన చేయడంతో నరసాపురం-మొగల్తూరు రోడ్‌లో పెద్ద ఎత్తున ట్రాఫిక్ జామ్ అయింది. సీఐ దుర్గాప్రసాద్, ఎస్సై జయలక్ష్మి ఆందోళనకారుల వద్దకు వచ్చారు. విప్, ఎమ్మెల్యే నాయకర్ ఘటనా స్థలానికి వచ్చారు. జరిగిన విషయాన్ని మృతుడి బంధువుల నుంచి ఆరా తీశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన బాధ్యులపై చర్యలు తీసు కుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళనకారులు శాంతించడంతో ట్రాఫిక్ క్లియర్ అయింది. ఎస్సై జయలక్ష్మి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చెరువులో చనిపోయిన చేపలు

విస్సాకోడేరులో తాగునీరు దుర్వాసన


మంచినీటి చెరువులో తేలుతున్న చేపలు

పాలకోడేరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): అదొక మేజర్ పంచాయతీ. 15 వేలు జనాభా కలిగిన గ్రామం. 15 వేల మందికి తాగునీరందించే ప్రధాన మంచినీటి చెరువు. అటువంటి మంచినీటి చెరువును అధికారులు వారం రోజులుగా పట్టించుకోకుండా ఉండటంతో కుళాయిల ద్వారా సరఫరా చేసే తాగునీరు దుర్వాసన వెదజల్లుతున్నదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. విస్సాకోడేరు గ్రామ పంచాయతీలో ఈ పరిస్థితి నెలకొన్నది. చెరువులో వారం రోజులుగా చేపలు చనిపోయి దుర్వాసన వెదజల్లుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం బాధాకరమని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇదే విషయమై గ్రామ పంచాయతీ కార్యదర్శి పవన్‌కుమార్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా ఈ రాత్రే చనిపోయిన చేపలను బయటకు తీసివేస్తామని బదులిచ్చారు. అదేవిధంగా ఈవోపీఆర్‌డీ రాంప్రసాద్‌ను వివరణ కోరగా తన దృష్టికి ఇప్పుడే వచ్చిందని ప్రజలకు ఇబ్బంది లేకుండా తక్షణ చర్యలు చేపడతామని అన్నారు.

పాము కాటుకు వ్యక్తి మృతి

పెదవేగి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): కోళ్లఫారంలో పనిచేస్తున్న వ్యక్తి పాముకాటుకు గురై మృతి చెందాడు. ఎస్ఐ కె.రామకృష్ణ తెలిపిన వివరాలు ప్రకారం.. ఖమ్మం జిల్లా మేడిచర్ల గ్రామానికి చెందిన ముక్తి నరసింహారావు, భార్యతో కలిసి పెదవేగి మండలం చక్రాయగూడెం గ్రామంలో జుజ్జూరి సత్యనారాయణకు చెందిన కోళ్ల ఫారాల్లో మూడు నెలలుగా పనిచేస్తున్నాడు. శనివారం కోళ్ల ఫారమ్‌లో పనిచేస్తుండగా మధ్యాహ్నం చేతిపై పాము కాటు వేసింది. వెంటనే ఏలూరు ప్రభుత్వా సుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మధ్యాహ్నం రెండుగంటల సమయంలో మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

చేపలు పట్టడానికి వెళ్లి మృత్యువాత

ఆకివీడు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : చేపలు పట్టడానికి వెళ్ళి ప్రమాదవశాత్తు కాలువలో పడి వ్యక్తి మరణించాడు. ఆకివీడుకు చెందిన చిప్పల మల్లిఖార్జునరావు (44) శనివారం స్థానిక అయి-భీమవరం రోడ్‌లోని వినాయక వైన్స్ వెనుక ఉన్న బో దెలో చేపలు పట్టడానికి వెళ్ళి పడిపోయి మరణించాడు.భార్య ధనలక్ష్మి ఫిర్యాదు మేరకు ఎస్ఐ నాగరాజు కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

ఏలూరు క్రైం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : చాటపర్రు గ్రామానికి చెందిన గండికోట వెంకటేశ్వరరావు (70) కొంతకాలం నుంచి తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆ బాధను భరించలేక ఈనెల 17వ తేదీన ఇంటి వద్ద పురుగుమందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతనిని కుటుంబ సభ్యులు గమనించి ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతున్న అతను శనివారం మృతి చెందాడు. ఈసంఘటనపై ఏలూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సత్య సాయిబాబా సినిమా పాటల ఆవిష్కరణ


పుట్టపర్తిలో సత్య సాయిబాబా సినిమా పాటలను ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు.. చిత్రంలో కరాటం

కొయ్యలగూడెం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి):సినీ నిర్మాత, మాజీ డీసీసీబీ ఛైర్మన్ కరాటం రాంబాబు నిర్మాతగా వ్యవహరిస్తున్న 'శ్రీ సత్యసాయి బాబా' సినిమా పాటలను రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు విడుదల చేశారు. శ్రీ సత్య సాయిబాబా శత జయంతి ఉత్సవాల్లో భాగంగా ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా ఆధ్వర్యంలో రూపొందించే శ్రీసత్యసాయి బాబా సినిమా పాటలను నిర్మాత కరాటం రాంబాబు సమక్షంలో పుట్టపర్తి ప్రశాంతి నిలయంలో ముఖ్యమంత్రి శనివారం రాత్రి విడుదల చేశారు. ఈ సందర్భంగా సాయిబాబా సేవా కార్యక్రమాలను ముఖ్యమంత్రి గుర్తుచేశారు. పుట్టపర్తి సాయిబాబా సినిమా ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు. సత్యసాయి సెంట్రల్ బోర్డు ఛైర్మన్ రత్నాకర్, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, రెవెన్యూ శాఖ మంత్రి అనగానే సత్యప్రసాద్, కో ప్రొడ్యూస ర్ కరాటం వంశీ కృష్ణ, కసుకుర్తి ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు

నిఘాతో మావోయిస్టులను పట్టుకున్నాం

డీఐజీ అశోక్‌కుమార్



మాట్లాడుతున్న డీఐజీ అశోక్ కుమార్

తాడేపల్లిగూడెం రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టుల కదలికలపై నిఘా పెట్టి ఏలూరులో పట్టుకోగలిగామని ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్ కుమార్ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం రూరల్ పోలీస్ స్టేషన్‌లో వార్షిక తనిఖీ నిర్వహిం చిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో శాంతి భద్రతలకు ఎలాంటి ఇబ్బంది లేదని స్పష్టం చేశారు. ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు తనిఖీ చేస్తున్నామని, గంజాయి నిర్మూలనకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. పాత నేరస్థుల పై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. గంజాయి అక్రమ రవాణాలపై దృష్టి సారి ంచామన్నారు. ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, సీఐలు రవికుమార్, ఆది ప్రసాద్, ఎస్సై ప్రసాద్, బాదం శ్రీను, నాగరాజు పాల్గొన్నారు.

పాండిచ్చేరి వర్సిటీ కోర్టు సభ్యుడిగా రవికిరణ్ శాస్త్రి



తాడేపల్లిగూడెం అర్బన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఏపీ నిట్‌లో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆచార్యులు డాక్టర్ జి.రవికిరణ్‌శాస్త్రి పాండిచ్చేరి విశ్వవిద్యాలయం కోర్టు సభ్యుడిగా నియమితులైనట్టు ఏపీ నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్‌శంకర్ రెడ్డి తెలిపారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, విశ్వవిద్యాలయ సందర్శకులు నామినేట్ చేశారన్నారు. మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతిగా, డీన్ అకడమిక్స్‌గా సమర్థంగా సేవలను శాస్త్రి అందిస్తున్నారన్నారు. ప్రస్తుతం డీన్ రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీగా, ఏఎస్ఆర్ఎఫ్ కో-ఆర్డినేటర్‌గా పనిస్తున్నారన్నారు.

భర్త మరణం తట్టుకోలేక భార్య ఆత్మహత్యాయత్నం


తమ్మిలేరులోకి దూకిన నారాయణమ్మ

ఏలూరు క్రైం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): భర్త మరణాన్ని తట్టుకోలే ఒక వృద్ధు రాలు తమ్మిలేరు కాలువలో దూకి ఆత్మహ త్యాయత్నానికి పాల్పడింది. ఏలూరు పవర్‌పేట కంకణాలవారి వీధికి చెందిన పూడి నారాయణమ్మ(65)కు భర్త ఎర్రయ్య శనివారం మధ్యాహ్నం అనారోగ్యంతో మృతి చెందాడు. భర్త మరణాన్ని భరించలేక ఆమె వెంటనే తంగెళ్ళమూడి వంతెన వద్దకు వచ్చి తమ్మిలేరులోకి దూకి నీళ్లల్లో పడిపోయింది. అక్కడే ఉన్న స్థానికులు వెంటనే ఆమెను గమనించి రక్షించారు. చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె చికిత్స పొం దుతున్నది. ఆసుపత్రి వైద్యులు ఈ సంఘటనపై ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

ఆగి ఉన్న లారీని ఢీకొని మోటారు సైక్లిస్టు మృతి


ఆగిన లారీని ఢీకొని మృతి చెందిన కొణదల సూర్య గాంధీ

ఏలూరు క్రైం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్నేహితుని వద్ద కు వెళ్ళి రాత్రి వేళ తిరిగి వస్తూ ఉండగా జాతీయ రహదారిలో మరమ్మతులకు గురై ఆగి ఉన్న ఒక లారీని ఢీకొన్న సంఘటనలో ఆ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. అనకాపల్లిలోని గవరపాలానికి చెందిన కొణదల సూర్య గాంధీ (28) బికాం కంప్యూటర్స్ డిగ్రీ చదివి ప్రస్తుతం తాడేపల్లిగూ డెంలో సాఫ్ట్‌వేర్ నేర్చు కుం టున్నాడు. తన స్నేహితుడిని కలుసుకునే నిమిత్తం శుక్రవారం విజయవాడ వెళ్ళి తిరిగి రాత్రి మోటారు సైకిల్‌పై తాడేపల్లిగూడెం వెళ్తున్నాడు. మార్గమధ్యలో ఏలూరు సమీపంలోని చుట్టుగుంట బ్రిడ్జి దగ్గరలో ఒక లారీ విజయవాడ నుంచి ఏలూరువైపు వెళ్తుండగా ఆ లారీ యాక్సిల్ విరిగిపోయింది. దీంతో లారీని రోడ్డుపైనే ఆపివేశాడు. ఆ లారీకి ఎలాంటి సిగ్నల్ లైట్లు కాని ముందస్తు హెచ్చరిక బోర్డులు కాని పెట్టలేదు. అతి వేగంగా వస్తున్న సూర్యగాంధీ ఆ లారీని గమనించక వెనుక ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సమాచారం ఏలూరు త్రి టౌన్ సీఐ వి కోటేశ్వరరావుకు అందడంతో ఆయన ఆదేశాలతో పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృత దేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

పశువుల చెరువులో పడి యువకుడి మృతి


సందీప్ (ఫైల్)

ఆకివీడు రూరల్ నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆకివీడు మండలం పెదకాపవరం గ్రామంలో కఠారి సందీప్(21) పశువుల చెరువులో పడి శనివారం మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం గ్రామానికి చెందిన కఠారి దుర్గాప్రసాద్, పార్వతిల కుమారుడు భీమవరంలోని ఒక ప్రైవేటు కాలేజీలో డిగ్రీ రెండో సంవత్సరం చదువు తున్నాడు. శనివారం సెలవు కావడంతో గంటలరాయుడు పేటలోని పశువులు చెరువులో పశువులను కడుగుతూ ప్రమాదవశాత్తు నీట మునిగిపోతుండగా అక్కడే ఉన్న వృద్ధుడు సమీపంలోని వారిని తీసు కెళ్ళే సరికి చెరువులో మునిగిపోయాడు. స్థానికులు గాలించి బయటికి వెలికి తీసేసరికి అతను మృతి చెందాడు. కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరు అవుతున్నారు. దీంతో ఈప్రాంతంలో విషాదఛాయలు అలుముకున్నాయి.